క్లుప్తంగా

గణపతి సచ్చిదానంద జన్మదిన వేడుకలు



హోమం చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): గణపతి సచ్చిదానంద స్వామీజీ జన్మదిన వేడుకలను సూర్య దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు స్వామి జన్మదినాన్ని పురస్కరించుకొని స్వామి వారి పాదుకలకు సుగంధ ద్రవ్య జలాభిషేకం, పంచామృతాభిషేకం, అర్చన, మహా మంగళహారతి, మంత్రపుష్పం తదితర ప్రత్యేక పూజాలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీగణపతి హోమం, మృత్యుంజయ హోమం, ఆయుష్యహోమం, ఆదిత్య హృదయ హోమం, మహా పూర్ణహుతి జరగడంతో వేలదిగా భక్తులు హాజరై స్వామి కృపకు పాత్రులయ్యారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జి.రామకృష్ణ

కర్నూలు(సెంట్రల్): 2023 ఖరీఫ్,రబీ సీజన్లలో పంటలు నష్టపోయిన రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ అందజేసి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఇప్పటి వరకు కొంమంది రైతులకే పరిహారం అందిందన్నారు. రబీ సీజన్‌కు సంబంధించిన లెక్కలను త్వరగా వేసి వారికి వర్షాలు పడేలోపు పరిహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులుహనుమంతరెడ్డి, రంగారెడ్డి, కోటకొండ సూరి, ఏ.కృష్ణ పాల్గొన్నారు.

శారీరక మానసిక ఆరోగ్యానికి క్రీడలు అవసరం

కర్నూలు (టౌన్) : శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు అవసరమని కార్డియాలజిస్టు డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం స్థానిక పెద్ద మార్కెట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్‌లో సాధన చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు చదువుల్లో చురుగ్గా ఉంటారన్నారు. ఆత్మరక్షణ కోసం బాలికలు ఇలాంటి క్రీడల వైపు ఆసక్తి చూపాలన్నారు. కరాటేలో మంచి ప్రతిభ చాటిన విద్యార్థినీ, విద్యార్థులకు ఆయన బెల్ట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉషూ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

తైక్వాండో చిన్నారులకు పండ్ల పంపిణీ

కర్నూలు (టౌన్) : స్థానిక పాతబస్టాండ్ కొండారెడ్డి బురుజు ఎదురుగా ఉన్న మున్సిపల్ పార్కులో ఆదివారం నిర్వహించిన తైక్వాండో వేసవి శిక్షణ శిబిరంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు పాల్గొని చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తైక్వాండోలో సాధన చేసి క్రీడాకారులుగా రాణించాలన్నారు. విద్యార్థినీ విద్యార్థులు శారీరక శ్రమ కలిగిన క్రీడలను ఎంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): స్థానిక బళ్లారి రోడ్డు సెక్షన్ పరిధిలో కొత్త విద్యుత్ లైన్‌లు వస్తుండటం వల్ల వీకర్‌సెక్షన్ కాలనీ ప్రాంతంతో పాటు వివిధ కాలనీలకు నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ నాగప్రసాద్ తెలిపారు.11కేవీ వీకర్ సెక్షన్ కాలనీ ఫీడర్‌లో ఈ కాలనీతో పాటు బిల్డింగ్‌ల సెంటరు, ఉల్చాల రోడ్డు, స్కంద వెంచర్లు, ఆదిత్య నగర్,భ్రమరాంబ నగర్, ఉల్చాల ఏపీ గోదాము, ,కల్లూరు పరిధిలోని రాజీవ్ గృహకల్ప ప్రక్కన బోసిరెడ్డి కాలనీ, లెప్రసి కాలనీ, ఎలుకూరు బంగ్లా, శిల్పనందనవనం, సిద్ధార్థ హోమ్స్ తదితర ప్రాంతాలకు సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని..వినియోగదారులు సహకరించాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

సారా బట్టీ ధ్వంసం

ఆదోని అర్బన్: పట్టణంలోని రణమండల కొండలో డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో ట్రైనీ డీఎస్పీ ధీరజ్, వన్‌టౌన్ సీఐ తేజమూర్తి, సిబ్బంది కలిసి కార్డెన్‌సెర్చ్‌లో భాగంగా కొండలోని నాటుసారా బట్టీపై ఆదివారం దాడులు నిర్వహించారు. బట్టీల వద్ద డ్రమ్ములను ధ్వంసం చేసి నాటుసారా ఊటను నేలపాలు చేశారు. 2 వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తేజమూర్తి తెలిపారు.



విపరీతంగా పెరిగిన గుర్రపుడెక్కతో పచ్చగా మారిన కేసీ కెనాల్

పంట చేను కాదు.. గుర్రపు డెక్క

కర్నూలు (న్యూటౌన్): కేసీ కెనాల్‌లో నీటి ప్రవాహం నిలిచిపోవడంతో విపరీతంగా గుర్రపు డెక్క పెరిగిపోయింది. కెనాల్ అడుగు భాగం కనిపించని విధంగా పరుచుకుపోవడంతో పచ్చని పంట చేనును తలపిస్తోంది. దీంతో ఈ మార్గంలో వెళ్లే ప్రయాణికులు బాటసారులు కెనాల్ వైపు ఆసక్తిగా చూస్తూ వెళ్తున్నారు. కాగా కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారంతో పాటు పెరిగిన గుర్రపుడెక్క దోమలకు ఆవాసంగా మారింది. చీకటిపడితే చాలు అవి బయటకు వచ్చి హల్‌చల్ చేస్తున్నాయి. నగర ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నీటి పారుదల శాఖ అధికారులు, కర్నూలు నగర పాలక సంస్థ అధికారులు స్పందించి కేసీ కెనాల్‌లో విపరీతంగా పెరిగిన గుర్రపుడెక్కను, చెత్తాచెదారాన్ని తొలగించి, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



కేసీ కెనాల్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

పాణ్యం: మండల పరిధిలోని కొండుజూటూరు గ్రామంలో సీఎస్ఐ చర్చి ప్రారంభోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన ఉమ్మడి కర్నూలు జిల్లా హోమ్ టీమ్ కబడ్డీ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలను మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, గ్రామ సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇలాంటి పోటీలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకోవాలన్నారు. గెలుపోటలమును సమానంగా స్వీకరించాలన్నారు. ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 20 జట్లు పోటీల్లో తలపడనున్నట్లు తెలిపారు. పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. విజేతలుగా నిలిచిన జట్లకు వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు అందించనున్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న సద్దల సూర్యనారాయణ రెడ్డి

క్రీడలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. చర్చి నిర్వాహకులు క్రీడాకారులకు, చర్చిని సందర్శించేందుకు వచ్చే వారికి అన్ని సౌకర్యాలు కల్పించారు. చర్చి సంఘ పెద్దలు, గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

1న హుండీ ఆదాయం లెక్కింపు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపును జూన్ 1వ తేదీ చేపట్టనున్నట్లు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్, డిప్యూటీ కమిషనర్ హెచ్.వెంకటేశ్వర్లు తెలిపారు. హుండీ లెక్కింపులో పాల్గొనే వారు పంచ, ఉత్తరీయం (టవల్) తప్పక ధరించి హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా కోరారు.

నేడు పాలిటెక్నిక్ కాలేజీలో జాబ్ అచీవర్స్ వేడుకలు

కర్నూలు సిటీ: నగర శివారులోని బి.తాండ్రపాడు వద్ద ఉన్న ఎస్.జి.పి.ఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు జాబ్ అచీవర్స్ డే వేడుకలు నిర్వహించనున్నారు. ఈ కాలేజీలో విద్యను అభ్యసించి వివి కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైన వారికి జాబ్ ఆఫర్ లెటర్లు అందజేయనున్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని ఆరోగ్యభారతి క్షేత్ర సంఘటనా కార్యదర్శి కుమారస్వామి చెప్పారు. ఆరోగ్యభారతి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని భరతమాత టెంపుల్ వద్ద ఆరోగ్య భారతి అభ్యాసక వర్గ కార్యకర్తలకు ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా హాజరైన కుమారస్వామి మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండేందుకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. సీజనల్ వ్యాధులపై జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, దంత రోగాలు, చికిత్సపై డాక్టర్ అశ్విని, వంటింటి ఔషధాలు, గృహవైద్యంపై జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి, ప్రసూతి స్త్రీ రోగాలపై డాక్టర్ ఎస్. వెంకటరమణ, యోగాపై యోగాగురువు అనురాధ, సంతాన సాఫల్యంపై డాక్టర్ బి. విశ్వనాథ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య భారతి ప్రాంత కార్యదర్శి డాక్టర్ ఎండీవీఎస్ రామశర్మ, జిల్లా కార్యదర్శి బి. సత్యనారాయణ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణవేణి, మహేష్, శేఖరగుప్త, మల్లికార్జున, రాఘవేంద్ర, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కుమారస్వామిని సన్మానిస్తున్న ఆరోగ్యభారతి సభ్యులు

కూచిపుడి నాట్యంలో ప్రతిభ

ఆదోని అర్బన్: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాశి (కాశీ)లో తాండవ కృష్ణ భారతీయ నృత్యోత్సవ్ ఆధ్వర్యంలో కాశీ నృత్య మహోత్సవం కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆదోని పట్టణానికి చెందిన శ్రీ గురుకృప నాట్యాలయం నుంచి బాలికలు మనోజ్ఞ, మహతి కూచిపుడి నృత్య ప్రదర్శన చేసి అందరినీ అలరించారు. వివిధ రాష్ట్రాల నుంచి కూచిపుడి, భరతనాట్యం, జానపదం, పేరిణి, మోహినినాట్యం, ఆంధ్ర నాట్యం, కథాకళి, ఒడిస్సా, మణిపురి, కోలాటం కళాకారులు పాల్గొన్నారు. పట్టణానికి చెందిన బాలికలు నృత్య ప్రదర్శన చేసి ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ నటుడు, దర్శకుడు నవీన్‌కుమార్ గట్టు, కార్యక్రమ నిర్వాహకులు నాట్యశ్రీ, ఉదయశ్రీ, మనోజ్, గురువు వీరజ్ రాయల్ పాల్గొన్నారు.



నిర్వాహకుల చేతులమీదుగా ప్రశంసా పత్రాలను అందుకుంటున్న బాలికలు

ముగిసిన మహిళల ఫుట్‌బాల్ పోటీలు

కర్నూలు (టౌన్): నగర శివారులోని లక్ష్మీపురం రిడ్జ్ పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న ఫుట్‌బాల్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఫైనల్‌లో లక్ష్య ఫుట్‌బాల్ సెంటర్ జట్టు నిజమాబాద్ మహిళల ఫుట్‌బాల్ జట్టుతో తలపడి 4–3 స్కోర్‌తో విజయం సాధించింది. అనంతరం అతిథులు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్‌సంఘం జిల్లా అధ్యక్షుడు ముప్పా రాజశేఖర్, ఫిజికల్ డైరెక్టర్ పాల్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళా ఐక్యవేదికను బలోపేతం చేద్దాం

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదికను మరింత బలోపేతం చేద్దామని వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి కోరారు. ఆదివారం స్థానిక బీ క్యాంప్‌లోని కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ కమిటీ సభ్యులందరూ కలిసికట్టుగా ఐక్యంగా ఉండి మహిళల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు. అవసరమైతే అధికారుల దృష్టికి తీసుకుపోయి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల్లో కమిటీ నిర్మాణాలు చేపట్టాలన్నారు. మహిళలు తమ ఆత్మగౌరవం, హక్కులకై నిరంతరం పోరాడాల్సిన పరిస్థితులు ప్రస్తుత సమాజంలో ఉన్నాయన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, హత్యలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు నిర్వహించేందుకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు రాధ, హుసేన్‌బీ, భాను, పెద్దక్క, ఖాసీంబీ, పద్మావతి, దస్తగిరమ్మ, షేకూన్‌బీ, రేవతి, అమీనాబీ, ప్రభావతి, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి

జీజీహెచ్‌కు సమర్థ అధికారిని నియమించాలి

కర్నూలు(హాస్పిటల్): రాయలసీమ సంజీవనిగా పేరుగాంచిన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు సమర్థమైన అధికారిని సూపరింటెండెంట్‌గా నియమించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి బి. రవికుమార్, కన్వీనర్ ఎం. రామకృష్ణారెడ్డి, జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు డాక్టర్ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ ఆసుపత్రిలో రాయలసీమ, తెలంగాణా, కర్ణాటక ప్రాంతాల నుంచి ప్రతిరోజూ 3 వేల మంది రోగులు వైద్యసహాయం పొందుతున్నారన్నారు. ఇలాంటి ఆసుపత్రికి సమర్థవంతమైన కార్యనిర్వహణాధికారి కావాలన్నారు. ప్రస్తుతం సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి త్వరలో పదవీ విరమణ పొందనున్నారన్నారు. ఆయన స్థానంలో ఇప్పటి వరకు డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఉండి, ఆసుపత్రి పరిపాలనపై అనుభవం ఉన్న గుండె, ఊపిరితిత్తుల శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ ప్రభాకర్‌రెడ్డిని నియమిస్తే బాగుంటుందన్నారు. కోవిడ్ సమయంలోనూ ఆయన సమర్థవంతంగా సేవలందించారని గుర్తు చేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పాణ్యం: ఈనెల 22వ తేదీన పాణ్యంలో వ్యక్తి అదృశ్యం కావడంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్ ఆదివారం తెలిపారు. వివరాలు.. హైదరాబాద్ పట్టణం అసిస్ నగర్‌కు చెందిన వి.శంకర్ (74), పసుపులేటి శ్రీనివాసులు మద్యం మానుకునేందుకు పాణ్యంలో ఉన్న సుంకులా పరమేశ్వరి ఆలయం వద్దకు ఈనెల 22వ తేదీ వచ్చారు. ఆలయంలో ఇచ్చే తాయత్తు, తీర్థం స్వీకరించి అక్కడే విశ్రాంతి తీసుకున్నారు. కొద్ది సేపటికే వి.శంకర్ కనిపించకుండా పోయాడన్నారు. శంకర్ కుమారుడు సునీల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అదృశ్యమైన వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

- కురువ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల పంపిణీ కార్యక్రమంలో వక్తలు

కర్నూలు(అర్బన్): విద్యార్థులు మంచి ఆలోచనా విధానాన్ని అలవర్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కురువ సంఘం నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పెద్దపాడు రోడ్డులోని బీరప్ప ఆలయ ఆవరణలో 2023–24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో అత్యధిక మార్కుల సాధించిన కురువ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సంఘం గౌరవాధ్యక్షుడు కె. కిష్టన్న, అధ్యక్షుడు పత్తికొండ శ్రీనివాసులు, సీపీఐ రాష్ట్ర నాయకులు పి. రామచంద్రయ్య, గుడిసె శివన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొర్రెల కాపరుల పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి మంచి ప్రయోజకులు కావాలన్నారు. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా టెన్త్, ఇంటర్ సెకెండ్ ఇయర్‌లో అత్యధిక మార్కులు సాధించిన 88 మంది విద్యార్థులకు మెమొంటో, సర్టిఫికెట్, నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కత్తి శంకర్, ధనుంజయ, బి. వెంకటేశ్వర్లు, ఉరుకుందు, రాయలసీమ విద్యార్థి సంఘం అధ్యక్షుడు రవికుమార్, రేమట సర్పంచ్ వెంకన్న, దేవేంద్ర, పాల సుంకన్న, బి. మల్లికార్జున, లీలమ్మ, నందిని, బీసీ తిరుపాలు, బి. మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురు నేతలను శాలువాతో కనకదాసు చిత్రపటాలను అందించి ఘనంగా సన్మానించారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు, నగదు అందిస్తున్న నేతలు



హాజరైన కురువ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు

వైఎస్ జగన్ మరోసారి సీఎం కావాలని..

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బెల్లం మహేశ్వరరెడ్డి ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల పోలింగ్ ముగిసిన అనంతరం ఆయన కేదార్‌నాథ్ వెళ్లారు. 2019 ఎన్నికల్లో కంటే అత్యధిక మెజారిటీతో విజయం సాధించి మరోసారి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టేలా ఆశీర్వదించాలని కేదారేశ్వరుడిని ప్రార్థించినట్లు ఆయన ఆదివారం అక్కడి నుంచి ఫోన్ ద్వారా తెలిపారు. జగనన్న పాలనలోనే సంక్షేమ పథకాలు అవినీతి, అక్రమాలకు తావు లేకుండా అమలవుతాయని, విద్య, వైద్యం అందరికి అందుబాటులో ఉంటుందన్నారు.



కేదారేశ్వర్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వరరెడ్డి పూజలు



అ 'పూర్వ' కలయిక

మద్దికెర: మిత్రమా కుశలమా అంటూ 1987–88 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 36 ఏళ్ల తరువాత అందరూ కలుసుకోవడంతో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరికొకరు పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తిక్కన్న, శేఖర్, మురళీ, చంద్ర, భాస్కర్, ప్రభాకర్, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లార్తిలో కార్డన్ సెర్చ్

హొళగుంద: మండల పరిధిలోని ఎల్లార్తి గ్రామంలో ఆదివారం ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో హొళగుంద ఎస్ఐ పెద్దయ్యనాయుడు, సిబ్బంది సోదాలు నిర్వహించారు. వచ్చే నెల 4వ తేదీ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనుండడంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ సోదాలు (కార్డన్ సెర్చ్) నిర్వహించినట్లు ఎస్ఐ పెద్దయ్యనాయుడు తెలిపారు. గ్రామంలోని రౌడీషీటర్లు, నేర చరిత్ర కలిగిన వారితో పాటు అనుమానితులు, ఆయా రాజకీయ పార్టీల నాయకుల ఇళ్లలో సోదాలు జరిపారు. కక్షలు, కార్పణ్యా లతో గొడవలు చేసి శాంతి భద్రతకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదని.. విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చడం వంటి వాటికి అనుమతి లేదన్నారు.

ఉత్తరం.. మధుర జ్ఞాపకం

- ఆధునికతలో తెరమరుగు
- లేఖలు లేక తపాలా పెట్టెలు వెలవెల
- స్మార్ట్‌ఫోన్‌తో వెనుకటి వైభవానికి చెల్లుచీటీ

కర్నూలు (న్యూటౌన్): గతంలో ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా ఒకరికొకరికి సంభాషణ జరిగేది. దసరా, సంక్రాంతి, దీపావళి పండుగల సంగతి నుంచి, అన్ని సంఘటనల వైనాలను జాబుల్లో నిక్షిప్తం చేసేవారు. తమకు నచ్చే జాబులను ఆసక్తిగా చదువుకునే వారు. వచ్చిన జాబులన్నింటినీ భద్రంగా దాచుకునేవారు. గుర్తుకు వచ్చినప్పుడు తీసి చదువుకుని జ్ఞాపకాలను నెమరువేసుకునేవారు.

సాంకేతిక విప్లవం జోరందుకున్న కొద్దీ నేటితరం ఉత్తరాలంటే తెలియని స్థితిలో ఉంది. స్మార్ట్ ఫోన్ హోరులో లేఖ మనుగడకు ముప్పు ఎదురవుతోంది. విద్యార్థులు లేఖలు రాసేలా పాఠశాల స్థాయిలో ప్రోత్సహించకపోగా తర్వాత కూడా వీటి అవసరం లేదన్న ధోరణి కనిపిస్తోంది. 24 గంటలూ స్మార్ట్‌ఫోన్‌తో అరకొర సందేశాలు పంపడంలోనే ఆనందాన్ని వెతుక్కుంటున్న యువత లేఖ ప్రాధాన్యతను, అందులో ఆనందాన్ని తెలుసుకోలేకపోతోంది.



కర్నూలు హెడ్ పోస్టాఫీస్

ఇప్పటి తరం.. స్మార్ట్ రంగం

సాంకేతిక రంగం విరాజిల్లుతున్న ఈ రోజుల్లో పాత జ్ఞాపకాల సంగతి పక్కన పెడితే.. ఎటువంటి సమాచారమైనా క్షణాల్లో చేరుతుందనేది కొందరి వాదన. ఇప్పటి రోజుల్లో ఉత్తరాన్ని పోస్ట్ చేస్తే నాలుగైదు రోజుల తర్వాత చేరేది. కానీ ప్రస్తుతం క్షణాల్లోనే సమాచారం వస్తోందని పలువురు చెబుతున్నారు.



ఉత్తరాలు (ఫైల్)

సాంకేతికతతో పెరిగిన నేరాలు



సాంకేతికత అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో అందుకు తగ్గట్టు నేరాలు, ఘోరాలు అదే రీతిన జరుగుతున్నాయి. ముఖ్యంగా యువతీ, యువకులు చెడు వ్యసరాలకు బానిసలవుతున్నారు. అలాగే స్మార్ట్‌ఫోన్‌తో విద్యార్థుల చదువుకు సంబంధించి అన్ని విషయాలు లభిస్తున్నాయి. గతంలో పుస్తకాలు లభించక చెప్పులరిగేలా తిరిగేవారు. ఇప్పుడు ఆ దుస్థితి లేదు. సాంకేతిక అభివృద్ధి చెందడంతో గతంలాగా బ్యాంకులకు వెళ్లాల్సిన పని లేకుండా పోయింది. దాచుకున్న డబ్బు తీసుకోవాలంటే బ్యాంకుల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది.

– హఫీజ్ అబ్దుల్లా, ముస్లిం మత గురువు, కర్నూలు

అద్భుతమైన జ్ఞాపకం



తల్లిదండ్రులతో కష్టసుఖాలు, అనుభవాలను పంచుకుంటే అదో అద్భుతమైన తీపిగుర్తు. ప్రస్తుతం టెక్నాలజీ పెరిగే కొద్దీ కలం, కాగితాన్ని పక్కన పెట్టి స్మార్ట్‌ఫోన్లకు పని చెబుతున్నారు. ప్రతి చిన్న విషయానికి వాట్సాప్, ఫేస్‌బుక్, సెల్‌ఫోన్ మెసేజ్‌ల ద్వారా చేరవేస్తున్నారు.

– జి.జనార్థన్‌రెడ్డి, సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్, కర్నూలు డివిజన్

ఉత్తరం అదో తీపి గుర్తు



మనలోని భావాల్ని ఎదుటి వారికి నేరుగా చెప్పలేని విషయాలను ఉత్తరాల ద్వారా చక్కగా వివరించవచ్చు. ఉత్తరం ఓ మధుర జ్ఞాపకం. మన తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు, ఇలా ఎవరికి రాసినా అదొక తీపి గుర్తు. లేఖలు భాషపై పట్టు పెంచుతాయి. ఈ విషయాన్ని నేటి తరం యువత గుర్తించాలి. మళ్లీ ఉత్తరాలు రాసే సంస్కృతిని తీసుకురావాలి.

– డాక్టర్ మీనిగ శ్రీనివాసులు, కర్నూలు

గొప్ప సంస్కృతి



లేఖలు రాయడం గొప్ప సంస్కృతి, చాచా నెహ్రూ జైల్లో ఉన్నప్పుడు ఇందిరాగాంధీకి ఉత్తరాలు రాశారు. అది ఆమెను ఎంతో ప్రేరేపించింది. మనం చెప్పాలనుకున్న విషయాలను, ఆలోచనలు, భావాలను ఫోన్ల ద్వారా చెప్పడం కంటే ఉత్తరాల్లో చక్కగా రాసి పంపవచ్చు. నేను చిన్నప్పటి నుంచి కళాశాలల్లో చదివే వరకు లేఖలు రాసి, స్నేహితులు, బంధువుల క్షేమ సమాచారాన్ని తెలుసుకునేవాడిని. ఇప్పటికీ వాటిని దాచుకున్నాను.

– వెంకటేష్ నాయక్, తహసీల్దార్

బాల్యం నుంచి అలవాటు



చిన్నప్పటి నుంచి స్నేహితులు, బంధువులకు ఉత్తరాలు రాస్తూ ఉండేవాడిని. దసరా, సంక్రాంతి, దీపావళి సెలవులు వచ్చాయంటే చాలు ఉత్తరాల ద్వారానే సంభాషణలు సాగేవి. అందుకే ఉత్తరాలు రాయడం అంటే నాకు చాలా ఇష్టం. నా స్నేహితులు పంపిన ఉత్తరాలు నేటికీ పదిలంగా దాచుకున్నాను.

– రంగస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, కర్నూలు